www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 22 ఫిబ్రవరి 2025



అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరిగేలా చూస్తా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరిగేలా అసెంబ్లీలో గళం వినిపించండంటూ మదనపల్లె అగ్రిగోల్డ్ కస్టమర్ అండ్ ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే షాజహాన్ బాషా ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా అగ్రిగోల్డ్ కస్టమర్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ కంపెనీ ఆర్థిక మోసాలకుబలై లక్షలాదిమంది కస్టమర్లు ఏజెంట్లు తీవ్రంగా నష్టపోయారన్నారు. కంపెనీ ఆస్థులను బహిరంగ వేలం ద్వారా విక్రయించి అత్యవసర వైద్య, విద్య, పిల్లల పెళ్లిలకు లాంటి అవసరాలు ఉన్నవారికి, లక్షలు డిపాజిట్ చేసిన చిన్న పొదుపుదారులకు వెంటనే చెల్లింపులకు తగిన ఏర్పాట్లు చేశాలా, మరో డిపాజిట్ దారుడు బలికాకుండా ఆదుకునేలా అసెంబ్లీలో మాట్లాడి న్యాయం చేయాలని ఎమ్మెల్యేకు విన్నవించినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధిగా సిఎం, డిప్యూటీ సిఎంలతో మాట్లాడి బాధితులకు న్యాయం జరిగేలా ఎమ్మెల్యే చర్యలు తీసుకుంటారనే విశ్వాసం తమకుందన్నారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని, ఈ అంశాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

పురుషులకూ డ్వాక్రా సంఘాలు!



పురుషుల డ్వాక్రా సంఘాల ఏర్పాటు కసరత్తు ఊపందుకుంది. సమాజంలో ఆర్థికంగా తీవ్ర నిరాదరణకు గురైన భవన నిర్మాణ, గిగ్ తదితర రంగాల్లో వర్కర్లుగా పనిచేస్తున్న పురుషులను ఆదుకోవాలని భావించింది. వలనరబుల్ గ్రూపులను ఆదుకునేందుకు 100 రోజుల యాక్షన్‌ప్లాన్ రూపకల్పన చేసింది. ఆర్థికంగా చేయూతను అందించాలనే ఉద్దేశంతో డ్వాక్రా సంఘాల ఏర్పాటుకు ముందుకు వచ్చింది. కడప, అన్నమయ్య జిల్లాల్లో 360 పురుషుల డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఈ సంవత్సరంలో పురుషుల డ్వాక్రా సంఘాల ఆర్థిక స్వావలంబన, వాటి బలోపేతానికి కృషి చేయనున్నారు.

- వల్‌నరబుల్ గ్రూపులకు రుణాలు
- కడపలో 120, అన్నమయ్యలో 70 సంఘాలు ఏర్పాటు
- మార్చి అనంతరం రుణాలు మంజూరు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉభయ జిల్లాల్లో పురుషుల డ్వాక్రా సంఘాల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ప్రభుత్వం పట్టణ పేదరిక నిర్మూళన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో పురుషుల డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేసింది. 2024 డిసెంబర్‌లో కడప జిల్లాలో 188, అన్నమయ్య జిల్లాలో 62 డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించింది. మెప్మా అధికార యంత్రాంగం ఇప్పటి వరకు కడప జిల్లాలో 120, అన్నమయ్య జిల్లాలో 70 పురుషుల డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసింది. మార్చి నాటికి కడప జిల్లాలో పెండింగ్ డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో పరుగులు తీస్తోంది. సభ్యులు 18 ఏళ్ల నుంచి 59 ఏళ్లలోపు ఉండాలి. ఒక్కో డ్వాక్రా సంఘానికి ఐదుగురు చొప్పున ఎంపిక చేయనుంది. సమాజంలో సామాజికంగా, ఆర్థికంగా చితికిన, పేదరికంలో అట్టడుగున నిలిచిన భవన నిర్మాణ కార్మికులు, తాపీలు, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్స్, వాచ్‌మెన్స్, హమాలీలు, ట్రైల్స్, ఇళ్లలో పనిచేసే మహిళా వర్కర్లు, షాపుల దగ్గర పనిచేసే వాళ్లు, పిల్లలను చూసుకునే వాళ్లు, వృద్ధుల సంరక్షకులు, రజకులు, పెంపుడు జంతువులను చూసుకునే వాళ్లు చెత్త వ్యర్థాల సేకరణ కూలీలు, గిగ్ వర్కర్లు జొమాటో, స్విగ్గీ, ర్యాపిడ్, వర్కర్లను ఎంపిక చేయాలని నిర్ణయించింది. కడప జిల్లాలో 188, అన్నమయ్య జిల్లాలో 70 పురుషుల డ్వాక్రా సంఘాలను ఆదుకునేందుకు గల మార్గాలను అన్వేషిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి మూడు నెలల నుంచి ఆర్నెళ్లపాటు ఎంపికైన డ్వాక్రా సంఘాల సభ్యుల బ్యాంకింగ్ లావాదేవీలను పరిశీలించనుంది. ఆయా గ్రూపుల క్రమం తప్పని చెల్లింపుల ఆధారంగా డ్వాక్రా సంఘాలకు ఐదు నుంచి పది రెట్ల మేరకు బ్యాంకుల ద్వారా రుణాలను మంజూరు చేయించాలనే ఆలోచనలో ఉంది. మొదటి విడత రుణాల చెల్లింపుల ఆధారంగా మలి విడత రుణాల మంజూరు లక్ష్యాన్ని మరింతగా పెంచడానికి గల అవకాశాలు ఉన్నాయని చెబుతోంది. మొదటి విడత అనంతరం మహిళా డ్వాక్రా సంఘాల తరహాలో రుణాల లభ్యత ఉంటుందని చెబుతోంది. ఏదేమైనా పేదరికంలో మగ్గుతున్న కుటుంబాలకు చెందిన సభ్యులకు బ్యాంకు రుణాల ద్వారా చేయూతను అందించడం ఉపశమనాన్ని కలిగిస్తుందనడంలో సందేహం లేదు. దీనిపై మెప్మా పీడీ ఎం.కిరణ్‌కుమార్‌ను సంప్రదించగా సమాజంలోని వల్‌నరబుల్ పురుషులను గుర్తించి, వారి కుటుంబంలోని స్త్రీ, పురుషులతో డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొనడం గమనార్హం.

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోండి

- అధికారులకు కలెక్టర్ శ్రీధర్ ఆదేశం



ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలోని బైపాస్ రోడ్డులో వాగు ఆక్రమిత ప్రభుత్వ భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి రెవెన్యూ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం పట్టణం బైపాస్ రోడ్డులోని ప్రభుత్వ భూములను కలెక్టర్ పరిశీలించారు. బైపాస్ రోడ్డులోని రాయచోటి గ్రామ పొలం సర్వే నెంబర్ 592 వాగు భూమిగా స్వభావం కలిగి ఈ నెంబర్ నుండి సర్వే నెంబర్ 996/2బి విస్తీర్ణం 1.62 సెంట్లు, సర్వే నెంబర్ 997 విస్తీర్ణం 8.34 సెంట్లు, 1003 నందు 3.93 సెంట్లు ఉన్నట్లు తహశీల్దార్ నరసింహ కుమార్ కలెక్టరుకు వివరించారు. ఈ భూములపై దరఖాస్తు పట్టాలు ఇచ్చినట్లు రికార్డ్స్‌లో లేవని, అయినను భ్రమలో క్రయవిక్రయాలు జరిగినట్లు తెలుస్తోందన్నారు. ఇందుకు సంబంధించిన భూమి రికార్డులను కూడా కలెక్టరు పరిశీలించారు. ఇవి ప్రభుత్వ భూములుగా భావిస్తూ ప్రభుత్వ భూములపై క్రయవిక్రయాలు జరగకూడదు కాబట్టి వెంటనే ఈ భూములను తిరిగి స్వాధీన పరచుకోవాలని కలెక్టరు సూచించారు. 22ఎ కింద నమోదు చేయాలని, సదరు భూమిలో ఉన్న పెన్సింగ్‌ను కూడా తొలగించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ నరసింహ కుమార్, ఆర్ఐ ప్రశాంతి, విఆర్ఒ, విఆర్ఎ, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

టమోటా రైతులు ఆందోళన చెందొద్దు : మంత్రి

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలోని టమోటా రైతులు ఆందోళన చెందరాదని, గిట్టుబాటు ధరకు టమోటాలను కొనుగోలు చేసేందుకు కూటమి ప్రభుత్వం ఇప్పటికే అవసరమైన చర్యలు చేపట్టిందని రవాణా, క్రీడలు, యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మార్కెట్‌లో టమోటా ధరలు తగ్గుతున్న పరిస్థితులలో ప్రభుత్వం టమోటా పంట రైతులను ఆదుకునేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టిందన్నారు. సరైన గిట్టుబాటు ధర వచ్చేలా తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ శాఖ మార్కెటింగ్ అధికారులతో వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు టెలి కాన్ఫరెన్స్ ద్వారా తగు సూచనలు జారీ చేశారన్నారు. జిల్లా వ్యాప్తంగా రబీలో 4303 ఎకరా లలో టమోటా పంటను రైతులు సాగు చేసినట్లు అధికారులు వివరించారన్నారు. జిల్లాలోని మద నపల్లి, ములకల చెరువులలో టమోటా మార్కెట్‌కు ప్రసిద్ధి చెందిందని తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా జిల్లాలోని మదనపల్లి మార్కెట్ నుంచి 12 మెట్రిక్ టన్నులు, ములకలచెరువు మార్కెట్ నుంచి 7.50 మెట్రిక్ టన్నుల టమో టాలను మంచి ధరకు ప్రభుత్వం కొనుగోలు చేసి 22వ తేదీన వాటిని గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, ఒంగోలు మార్కెట్లకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకంలో భాగంగా నాఫెడ్, ఎన్‌సిసిఎఫ్ ద్వారా టమోటాలను అన్ని ఆపరేషన్ ఖర్చులను వారే భరించే విధంగా టమోటా కొరత ఉన్న ఇతర రాష్ట్రాలైన తమిళ నాడు, తెలంగాణ, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలలో విక్రయించే విధంగా కేంద్ర ప్రభుత్వంతో వ్యవసాయ శాఖ మంత్రితో ఇప్పటికే సంప్రదించి అవసరమైన చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. తద్వారా కిలో టమోటా ధర సుమారు రూ.10 నుంచి రూ.15ల వరకు రైతులకు అందే అవకాశం ఉందన్నారు. ప్రాసెసింగ్ యూనిట్లకు టమోటాలను పంపి రైతులకు మంచి గిట్టుబాటు ధర వచ్చే విధంగా అన్ని రకాల చర్యలు కూడా తీసుకుని రైతులను ఆదుకునే విధంగా జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి పేర్కొన్నారు.

జాక్‌పాట్ పేరుతో రైతులను మోసం చేస్తే చర్యలు : ఎమ్మెల్యే

మదనపల్లె అర్బన్ : టమోటా ధరలు పతనమ వుతున్న నేపథ్యంలో రైతులను వ్యాపారులు మోసం చేస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక టమోటా మార్కెట్ యార్డులో ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్ పర్యటించారు. అనంతరం వ్యాపారులతో సమావేశమై రైతులకు కష్టకాలంలో వారిని ఆదుకోవాల్సిన బాధ్యత వ్యాపారులపై ఉందని పేర్కొన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని పేర్కొన్నారు. రైతు మరింత కష్టాల్లో కూరుకుపోయేలా కమీషన్ మండి వ్యాపారులు జాక్‌పాట్ పేరుతో మోసం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వంతో మాట్లాడి రైతులకు గిట్టుబాటు ధర అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులెవ్వరూ ఆధైర్య పడొద్దని, అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా కల్పించారు.

పోలీసు జాగిలం మ్యాగీ సేవలు అభినందనీయం : ఎస్‌పి



పోలీసు జాగిలం మ్యాగీని సన్మానిస్తున్న ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

పోలీసు జాగిలం మ్యాగీ 11 సంవత్సరాల పాటు విశిష్ట సేవలు అందించి, పలు కీలక విధులను సమర్థవంతంగా నిర్వర్తించడం అభినందనీయమని ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు అన్నారు. శుక్రవారం పోలీసు ప్రధాన కార్యాలయంలో పోలీసు జాగిలం మ్యాగీ పదవీ విరమణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హత్యలు, అత్యాచారాలు, దొంగతనం చేసిన వారిని గుర్తించడంలో ప్రత్యేక పాత్ర పోషించి పేరును సంపాదించిందని పేర్కొన్నారు. జర్మన్ షెపర్డ్ జాతికి చెందిన జాగిలం మ్యాగీ 2013 సంవత్సరంలో పుట్టిందని చెప్పారు. జాగిలం ఉద్యోగ సర్వీస్ 9 సంవత్సరాలు అయినప్పటికీ 11 సంవత్సరాలు విధులు నిర్వర్తించిందని పేర్కొన్నారు. 2014 సంవత్సరంలో హైదరాబాద్‌లో ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ వద్ద ట్రాకర్ విభాగంలో 8 నెలలు శిక్షణ పొందిందని తెలిపారు. అనంతరం ఆరు సంవత్సరాలు చిత్తూరు జిల్లాలో విధులు నిర్వర్తించిందని తెలిపారు. 2022 సంవత్సరంలో జిల్లాల పునర్విభజన నేపథ్యంలో అన్నమయ్య జిల్లాకు బదిలీపై వచ్చిందన్నారు. వివిధ రాష్ట్రాలలో జరిగిన ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో పాల్గొనిందని చెప్పారు. పదవీ విరమణ సందర్భంలో కూడా సంపూర్ణ ఆరోగ్యంతో చురుగ్గా ఉండేలా చూసు కుంటున్న హ్యాండ్లర్ బి.మణి గండంన్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం పోలీసు జగిలం మ్యాగీని పూలమాలవేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. జాగిలాలు అనుబంధం భావోద్వేగాలతో కూడుకొని ఉంటుందని, సమర్థవంతంగా విధులు నిర్వహించి ప్రశంసలు పొందడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి 'అడ్మిన్) ఎం.వెంకటాద్రి, ఎఐ బి.కృష్ణుడు, ఆర్‌ఐలు రామకృష్ణ, జోసెఫ్, స్పెషల్ బ్రాంచ్ సిఐ రాజా రమేష్, ఎఆర్‌ఐలు, డిపిఒ, పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

న్యాయవాదుల చట్ట సవరణను వ్యతిరేకిస్తూ నిరసన



కోర్టు మెయిన్ గేటు వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ప్రజాశక్తి-రాయచోటి

న్యాయవాదుల వృత్తిపరమైన ఇబ్బందులకు గురి చేసే న్యాయవాదుల చట్ట సవరణ బిల్లు-25ను వ్యతిరేకిస్తూ రాయచోటి న్యాయవాదులు శుక్రవారం కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలియజేశారు. రాయచోటి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.రెడ్డయ్య నేతృత్వంలో రాయచోటి న్యాయవాదులు విధులను బహిష్కరించి కోర్టు మెయిన్ గేటు వద్ద నిరసన తెలిపారు. కేంద్ర మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిన న్యాయవాదుల చట్ట సవరణ బిల్లు-25 అమలులోనికి వస్తే బార్ కౌన్సిల్ యొక్క స్వతంత్ర ప్రతిపత్తిని, న్యాయవాదుల వృత్తిపరమైన సమస్యలకు కారణం అవుతుందని న్యాయమాదులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కొత్త బిల్లు వలన దేశంలో న్యాయవాదులు స్వతంత్రంగా స్వేచ్ఛగా కేసులు చేసే పరిస్థితి కోల్పోతారని పేర్కొన్నారు. కార్పొరేట్ శక్తుల చేతుల్లోనికి న్యాయవాద వృత్తి వెళ్ళిపోతుందని ఇది ఒకరకంగా కక్షిదారులు స్వేచ్ఛగా తన న్యాయవాదిని ఎన్నుకునే పరిస్థితిని కూడా కోల్పోతాడని న్యాయవాదులు కూడా ఇప్పటిలాగా ఏ కేసైనా డీల్ చేయడానికి ముందుకు రాని పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితులన్నీ కూడా న్యాయ వ్యవస్థ యొక్క స్వతంత్ర ప్రతిపత్తిని దెబ్బతీసే విధంగా ఉంటాయని మొత్తంగా ఈ బిల్లు ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే విధంగా తయారవుతుందని దీనిని ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని వారు పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా న్యాయస్థానాలన్నింటిలో కూడా న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలియజేశారని వారన్నారు. కార్యక్రమంలో రాయచోటి బార్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి డి.నాగ ముని, న్యాయవాదులు ఆనంద్ కుమార్, చిన్నయ్య,టి. ఈశ్వర్, రెడ్డిబాషా, హుమయున్ భాష, ఎం.రవిశంకర్, నిరంజన్, వరలక్ష్మి, కృష్ణమ్మ, సయ్యద్ బాషా, న్యాయవాద గుమస్తాల సంఘం నాయకులు రామకృష్ణ, సుబ్బరామయ్య, రమణ, వీర నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామ పంచాయతీ కార్మికులు

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న దీర్ఘకాల సమస్యలు పరిష్కరించాలని ఎపి గ్రామ పంచాయతీ కార్మికుల సంగం రాష్ట్ర అధ్యక్షులు డి.వెంకట్రామయ్య పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో పంచాయతీ కార్మికుల జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు 3 నెలల నుండి 8 నెలల వరకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇఎస్ఐ, పిఎఫ్ చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న అధికారుల మీద చర్యలు తీసుకోవాలన్నారు. హైకోర్ట్ తీర్పు ప్రకారం ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన రెగ్యులర్ లిస్ట్ ప్రపోజల్ నివేదిక ప్రభుత్వానికి సకాలంలో జిల్లా అధికార యంత్రాంగం చొరవ చూపాలని కోరారు. గౌరవ అధ్యక్షులు ఎ.రామాంజులు, ప్రధాన కార్యదర్శి ఎస్. సురేంద్ర బాబు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిదులను గ్రీన్ అంబాసిడబర్లు శెట్టిపల్లి, వంగిమళ్ళ, బ్రాహ్మనపల్లి, దేవపట్లలతో పాటు కొన్ని పంచాయతీలకు పూర్తిగా చెల్లించలేదన్నారు. నాణ్యమైన పనిముట్లు లీవులు అమలు చేయాలన్నారు. బ్యాంక్‌ల ద్వారా వేతనాలు ఇవ్వాలని కోరారు. మేజర్ పంచాయతీలలో కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలతో కూడిన వినతిపత్రాలను డిఆర్ఒ, డిపిఒలకు అందాజేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు హరి, ఓబులేసు, కాంతమ్మ పార్వతమ్మ, రెడ్డెయ్య, పలు గ్రామ పంచాయతీలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.

ఆర్‌టిసిలో ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయాలి : ఇయు

ప్రజాశక్తి-పీలేరు

ప్రజా రవాణా సంస్థలో ఖాళీగా ఉన్న 12 వేల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని ఎపిపిటిడి ఇయు రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు తెలిపారు. శక్రవారం పీలేరు రోడ్లు భవనాల అతిథి గృహంలో అన్నమయ్య జిల్లా ఇయు వర్కింగు ప్రెసిడెంట్ కెవి రమణ అధ్యక్షతన పీలేరు ఆర్టీసీ డిపో ఎంప్లాయస్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదరరావు మాట్లాడుతూ ఆర్టీసికి భవిష్యత్తులో కొత్తగా ప్రవేశపెట్టాలనుకుంటున్న విద్యుత్ బస్సులను స్వాగతిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర విభజన నాటికి ఆర్టీసిలో 62 వేల మంది సిబ్బంది ఉంటే ప్రస్తుతం సుమారు 47 వేల మంది రెగ్యులర్ ఉద్యోగులు, సుమారు 8 వేల మంది అవుట్ సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపారు. అద్దెబస్సు డ్రైవర్లు, ఆన్‌కాల్ డ్రైవర్లు మరో 20 వేల మంది పనిచేస్తున్నారన్నారు. పస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టాలని భవిష్యత్తులో 2030 నాటికి ఆర్టీసీలో అన్ని బస్సులను విద్యుత్ బస్సులుగా మార్చాలన్న లక్ష్యాలను ఏర్పరుచుకోవడం మంచి పరిణామమని పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా విద్యుత్ బస్సులను ఏర్పాటు చేయటానికి ఎంప్లాయిస్ యూనియన్ వ్యతిరేకం కాదని తెలిపారు. సమావేశంలో జోనల్ నాయకులు జి.యస్ మణ్యం, అన్నమయ్యజిల్లా ఇయు అధ్యక్షులు సి.ఆనందబాబు, జిల్లాకార్యదర్శి బి.సి.శేఖర్ తోపాటు డిపో అధ్యక్షులు ఏ.ఆర్.చంద్ర, డిపోకార్యదర్శి యస్ ఖాధర్ బాషా, సిసియస్ డెలిగేట్లు కె.వి.రమణ, బి.వేణు, జిల్లా కమిటీ సభ్యులు వి.సోభారాణి, ఎం.శ్రీనివాసులు, ప్రధీప్ కూమార్ పాల్గొన్నారు.

భూగర్భ జలాల పెంపునకు చర్యలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

భూగర్భ జలాలను పెంపొందించడమే వాటర్‌షెడ్ పథకం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని ప్రజా ప్రతినిధులు, అధికారులు తెలిపారు. శుక్రవారం దుబ్బిగానిపల్లె సర్పంచ్ బుడ్డన్న ఆధ్వర్యంలో వాటర్ షెడ్ యాత్ర అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి పిఒ ఖాజా మొయినిద్దీన్, జెఇ ప్రత్యూష, టిఒలు మల్లికార్జున, ధర్మేంద్ర, కాత్యాయని, ఉప సర్పంచ్ సుధాకర్, రాజగోపాల్ హాజరయ్యారు. మొక్కలు నాటి వాటికి నీరు పోశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ భూగర్భ జలాలను పెంపొందించే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. వాటర్‌షెడ్ పథకంలో భాగంగా ఎన్‌ఆర్‌ఎం స్కీం కింద 27 పనులకుగాను రూ.38.57 లక్షలు, పిఎస్ఐ స్కీం కింద 59 మంది రైతులకుగాను రూ.12.50 లక్షలు, ఇపిఎ స్కీం కింద తొమ్మిది పనులకు గాను రూ.3.12 లక్షలు మంజూరయ్యాయన్నారు. అదేవిధంగా ఎన్‌ఆర్‌ఎం పథకంలో చిన్న ఊట కుంటలు 21, రాతి కట్టడాలు 4, డగౌట్ ఫాండ్ 1, ఫారం ఫాండ్ 1, పీఎస్ఐ పథకం కింద ట్రాక్టర్ మడకలు, ఆయిల్ ఇంజన్, తార్పాలిన్లు, స్ప్రేయర్ మిషన్లు, పివిసి పైపులు పొందవచ్చునన్నారు. ఇక ఇపిఎ పథకం కింద సోలార్ గ్రిడ్, సిమెంట్ బెంచెస్, అనిమల్ హెల్త్ క్యాంప్స్ నిర్వహించుకోవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. అనంతరం సర్పంచ్ బుడ్డన్న మాట్లాడుతూ వాటర్ షెడ్ పథకం అన్నదాతలకు ఓ వరం లాంటిదన్నారు. కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగిస్తే ఉలుకెందుకు? : 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేటకు అన్యాయం జరిగినపుడు, అన్నమయ్య డ్యాం తెగిపోయి అనేక ప్రాణాలు పోయినా ఇప్పటికీ అనేక మంది గూడు లేక ఇబ్బంది పడుతున్నా లేవని ఎమ్మెల్యే అకేపాటి అమర్నాథ్‌రెడ్డి, బినామీలు చట్ట విరుద్ధంగా నిర్మించిన నిర్మాణాలను అధికారులు తొలగిస్తే ఎక్కడ లేని బాధ కలుగుతుందని, టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు విమర్శించారు. శుక్రవారం పార్లమెంట్ క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దళితులను అడ్డం పెట్టుకొని రాజకీయంగా ఎదగడం, వారి పేరుతో ప్రభుత్వ భూములను దోచేయడం ఆకేపాటి సోదరులకు, వైసిపి నాయకులకు తెలిసినంతగా తమకు తెలియదని తెలిపారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలను తొలగిస్తే ఎక్కడలేని ఆవేదన ఎమ్మెల్యేకి వస్తుందన్నారు. జిల్లా కేంద్రం, మెడికల్ కలాశాల, అన్నమయ్య డ్యాం విషయంలో మరి ఎందుకు ఇంత ఆవేదన చెందలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, సిద్ధవటం క్లస్టర్ ఇన్‌ఛార్జి దశరథ నాయుడు, రాజంపేట పట్టణ క్లస్టర్ ఇన్‌ఛార్జి కొల్లి రెడ్డయ్య నాయుడు, సుండుపల్లె మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రసాద్ రాజు, మాజీ మండల అధ్యక్షులు కోవూరు సుబ్రహ్మణ్యం నాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

చెన్నముక్కపల్లి సర్పంచ్ చెక్ పవర్ రద్దు

ప్రజాశక్తి-రాయచోటి

గ్రామ పంచాయతీ విధులను దుర్వినియోగానికి పాల్పడ్డ రాయచోటి మండలం చెన్నముక్కపల్లి గ్రామ సర్పంచ్ రాయవరం మమత చెక్ పవర్‌ను రద్దు చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామంలో అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడ్డ సర్పంచ్‌పై జిల్లా సాయి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో ఫిర్యాదుల మేరకు అధికారులు విచారణ జరిపి నిధులు దుర్వినియోగం జరిగినట్లు గుర్తించారు. గ్రామ సర్పంచ్ పంచాయితీ నిధులను దుర్వినియోగం చేసినట్లు నిర్ధారణ కావడంతో సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

1న జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లా పరిధిలోని గంగమ్మ ఉత్సవాలు పురస్కరించుకొని యువతకు జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి మణికంఠ తెలియజేశారు. జిల్లా పరిధిలోని 15 సంవత్సరాల నుండి 29 సంవత్సరాలు వయసు గల యువత పోటీలలో పాల్గొనవచ్చునని వివరించారు. మార్చి 1వ తేదీన వాలిబాల్ టోర్నమెంట్‌ను ప్రభుత్వ పాఠశాల గ్రౌండ్స్, నేతాజీ సర్కిల్ రాయచోటి నందు నిర్వహిస్తామని తెలిపారు.జిల్లా స్థాయి పోటీలలో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతి, ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందిస్తున్నట్లు తెలిపారు. భారత ప్రభుత్వ నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో జిల్లా యువత పాల్గొని తమ ప్రతిభను మెరుగు పరుచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలలో పాల్గొని యువత తమ ప్రతిభను నిరూపించు కోవాల్సిందిగా సూచించారు. వివరాలకు 9182382644 సంప్రదించ వచ్చునన్నారు.

'అన్నమాచార్య'లో ఘనంగా హాస్టల్ డే వేడుకలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో శుక్రవారం హాస్టల్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ సాయిబాబా రెడ్డి హాజరై హాస్టల్ జీవితం విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో దోహదపడు తుందన్నారు. విద్యాసంస్థల వైస్ చైర్‌పర్సన్ సి.యల్లారెడ్డి మాట్లాడుతూ హాస్టల్ జీవితం విద్యార్థుల మానసిక వికాసానికి, బుద్ధి పదునెక్కించడానికి ఎంతగానో సహాయం డుతుందని వివరించారు. హాస్టల్ వార్డెన్ డాక్టర్ ఎస్.హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ హాస్టల్‌లో విద్యార్థులకు లభించే వసతుల గురించి వివరించి, వారికి మరింత మెరుగైన వాతావరణం కల్పించేందుకు విశ్వవిద్యాలయం నిరంతరం కృషి చేస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి సందడిని చేశారు. అనంతరం హాస్టల్‌లో విశేష సేవలు అందించిన సిబ్బందిని సన్మానించారు.



వ్యాపారులతో మాట్లాడుతున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

మార్కెట్‌లో సమస్యలకు శాశ్వత పరిష్కారం

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలోని కూరగాయల పాత మార్కెట్‌ను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. అక్కడ ఉన్న వ్యాపారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కొన్ని సంవత్సరాల నుంచి మార్కెట్లో మౌలిక సదుపాయాలు కావలసిన మేరకు లేకపోవడంతో ఇటు వ్యాపారస్తులు అటు కొనుగోలుదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తద్వారా ప్రజలు మార్కెట్ లోనికి వచ్చి కూరగాయలు కొనే పరిస్థితులు లేవని ఆయన తెలిపారు. మార్కెట్ మార్కెట్ కు సంబంధించి పూర్తిస్థాయిలో ప్రహరీ గోడ, గేట్లు లేకపో వడంతో చాలా ఇబ్బందులు పడుతున్నట్లు వ్యాపారస్తులు తెలిపారని వారం రోజు లోగా మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యలన్నిటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. గతంలో ఒక్కొక్కరికి రెండు లేదా అంతకంటే ఎక్కువ షాపులు ఉన్నాయని తెలిసిందని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి ఒక్కొక్కరికి ఒక్కొక్క షాపు ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. టిడిపి నాయకులు రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

మద్యం షాపులు పాఠశాలలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-పీలేరు

మద్యం దుకాణాలను పాఠశాలలు, ప్రార్థన మందిరాలకు దూరంగా ఉంచాలని కోరుతూ ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో విద్యార్థులు పీలేరు తహశీల్దారు భీమేశ్వరరావుకు వినతి పత్రం సమర్పించారు. శుక్రవారం వారు స్థానిక తహశీల్దారు కార్యాలయం ముందు జరిగిన ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ మాట్లాడుతూ పీలేరు పట్టణంలోని అజంతామిట్ట, నాలుగు రోడ్ల కూడలిలోని బ్రాందీ షాపులను బడులు, గుడులు, ప్రార్థన మందిరాలక్కు దూరంగా మార్చాలని అన్నారు. ఫలితంగా విద్యార్థులు, భక్తులు, స్థానికులు తీవ్ర అసౌకర్యానికి లోనౌతున్నారని అన్నారు. సమాజ హితం కోరి బ్రాందీ షాపులను ఇతర ప్రాంతాలకు మార్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు చీకటిపల్లి సాయి సంపత్ కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ కార్యదర్శి యూసఫ్, ఎన్ఎస్‌యుఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి రైతూ విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలి : డిఎఒ

ప్రజాశకి-రైల్వేకోడూరు

కేంద్ర ప్రభుత్వ సమన్వయంతో వ్యవసాయ శాఖ ద్వారా రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రనాయక్ తెలిపారు.శుక్రవారం మండలంలోని రాఘవరాజాపురం, ఓబనపల్లె గ్రామాల్లో నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎఒ మాట్లాడుతూ వెబ్ ల్యాండ్‌లో పొలం ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా రైతు సేవ కేంద్రాల్లో పనిచేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ ఉద్యానశాఖ సహాయకులను ఆధార్ కార్డుతో అనుసంధానమైన మొబైల్ నెంబర్, పట్టాదారు పాసుపుస్తకంతో సంప్రదించి రైతు విశిష్ట సంఖ్యను పొందవచ్చునని తెలిపారు. రైతు విశిష్ట సంఖ్య ద్వారా వ్యవసాయ సేవలు సులభతరం చేసి పారదర్శకంగా రైతులకు అందించేందుకు సహాయపడుతుందని అన్నారు. రైతులకు ప్రభుత్వం అందించే పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పెట్టుబడి సాయం, వ్యవసాయ యాంత్రాలు, పంట రుణాలపై వడ్డీ రాయితీ సూక్ష్మ సేద్యంపై రాయితీ విత్తనాలు, సూక్ష్మ పోషకాలు పంటల బీమా పొందడానికి తప్పనిసరిగా రైతు విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరిగా ఉండాలని అన్నారు. కార్యక్ర మంలో ఎడిఎ కె.కవిత, ఎఒ జి.సుధాకర్, ఉద్యాన సహాయకులు లక్ష్మీనారాయణ, హరిబాబు పాల్గొన్నారు. **పుల్లంపేట :**మండల పరిధిలోని అనంతయ్యగారిపల్లి, వత్తలూరు రైతు సేవ కేంద్రాలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రనాయక్ అకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా డిఎఒ మాట్లాడుతూ ప్రతి రైతు యూనిక్ ఐడి నమోదు చేయిం చుకోవాలని, లేకపోతే రైతులకు ప్రభుత్వం అమలు చేసే పిఎం కిసాన్, సున్నా వడ్డీ, అన్నదాత సుఖీభవ, పంటల భీమా వర్తించదని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోడూరు సహాయ వ్యవసాయ సంచాలకులు, పుల్లంపేట మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీకర్, రైతు భరోసా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


రైల్వేకోడూరు : యూనిక్ ఐడిపై అవగాహన కల్పిస్తున్న డిఎఒ చంద్రనాయక్

నేరాల నియంత్రణకు వ్యాపారులు సహకరించాలి

దుకాణాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి : సిఐ


మాట్లాడుతున్న సిఐ జీవన్‌గంగానాథ్‌బాబు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోని వ్యాపారులకు నేరాలు, బాధ్యతలపై బి.కొత్తకోట సిఐ జీవన్ గంగానాథ్ బాబు ఆధ్వర్యంలో స్థానిక కొండ కల్యాణ మండపంలో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి దుకాణంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకొని నేరాలు జరగకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. మైనర్లకు తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు ఇవ్వడం ప్రోత్సహించరాదని, చదువుకునే పిల్లలకు ప్రమాదం జరగడమే కాక ఇతరులకు ప్రమాదం జరిగేందుకు కారకులవుతారని అన్నారు. మైనర్లకు, లైసెన్స్ లేని వారికి వాహనాలు ఇచ్చినచో ఇచ్చిన వారిపై, లైసెన్స్ లేని వారిపై, తల్లితండ్రులపై కేసు నమోదు చేయడానికి ధర్మాసనంలో సెక్షన్లు ఉన్నాయని గుర్తు చేశారు. పలువురు వ్యాపారులు మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇవ్వడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. కొంతమంది ఆకతాయిలు మత్తు పదార్థాలు సేవించి ర్యాష్ డ్రైవింగ్, విన్యాసాలు చేస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని సిఐ దృష్టికి తీసుకెళ్లారు. పట్టణంలో వివిధ సమస్యలపై ప్రత్యేక నిఘా ఉంచామని, నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

- ప్రజా సంఘాల డిమాండ్

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని కల్పన చెరువు పంచాయతీ గాలం గుండ్లపల్లి చెందిన దళిత రిటైర్డ్ ఎస్ఐ టి.వెంకటపతి భూమిని ఆక్రమించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర సహాయకార్యదర్శి న్యాయవాది టి.ఈశ్వర్, భారతన్యాయవాదుల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు టివి.రమణ, ఎం.రవిశంకర్, డి.నాగముని, ఎం.శివకుమార్, రజక సంక్షేమ సంఘం అధ్యక్షులు టి.రమేష్, ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రామాన్ని సందర్శించి ఆక్రమణకు గురైన దళిత రిటైర్డ్ ఎస్ఐ వెంకటపతి భూములను రికార్డులను పరిశీలించారు. గ్రామస్తులు విచారించి వాస్తవాలను తెలుసుకున్నారు. రిటైర్డ్ ఎస్ఐ వెంకటపతి కల్పనా యిని చెరువు గ్రామం సర్వే నెంబర్ 50/1లో ఎ4.46 సెంట్ల పట్టా భూమిని 2008 సంవత్సరంలోనే కొని అనుభవంలో ఉన్నప్పటికీ పక్కనే ఉన్న భూ యజమా నులు అయిన రాచమల్లు ప్రసాద్, రాచమల్లు రమేష్, రాచమల్లు వెంకటరమణ రిటైర్డ్ ఎస్ఐ పట్టా భూమిని సుమారు ఎ1.50 సెంట్లు ఆక్రమించారని వారు అన్నారు. భూమికి సంబంధించిన రికార్డులు కూడా స్పష్టంగా ఉన్నాయని వారు తెలిపారు. ఈ విషయం గురించి రెవెన్యూ అధికారులు, పోలీసులు సైతం నిర్ధారించినప్పటికీ రిటైర్డ్ ఎస్ఐ వెంకట పతి దళితుడనే ఒక చిన్న చూపుతోనే అతనిపై సదరు వ్యక్తులు దౌర్జన్యం చేస్తూ దాడికి దిగుతున్నారని ప్రజా సంఘాల నాయకులు ఆరోపించారు. దళితుడైన రిటైర్డ్ ఎస్ఐ భూమిని ఆక్రమించిన వారిపై కేసు నమోదు చేసి శిక్షించాలని ప్రజా సంఘాల నాయ కులు డిమాండ్ చేశారు.


భూమిని పరిశీలిస్తున్న న్యాయవాదులు, ప్రజాసంఘాల నాయకులు

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-రామాపురం

ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశం కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్యామ లదేవి ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు www.cse.ap.gov.in లేదా www.apms. ap.gov.in వెబ్‌సైట్ ఆన్‌లైన్‌లో ఈనెల 24 నుంచి మార్చి 31 లోపు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు అర్హతలు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2023-24, 2024-25 రెండు సంవత్సరాలు చదివి ఉండాలన్నారు. 2024-25 విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలో గాని ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలలో గాని 5వ తరగతి పూర్తి చేసి ఉండాలన్నారు.ఒసి, బిసి విద్యార్థులు 1-9-2013 నుంచి 31-8-10-2015 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు 10-9-2011 నుంచి 31-8-2015 మధ్య జన్మించి ఉండాలన్నారు. ప్రవేశ పరీక్షలు రుసుం ఒసి, బిసిలకు రూ.150, ఎస్‌సి, ఎస్‌టిల కూ.75 చెల్లిం చాల్సిఉంటుందన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 20న ఉదయం 10 గంటల నంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్థానిక ఆదర్శ పాఠశాలలో నిర్వహించ ను న్నట్లు తెలిపారు. వివరాల కొరకు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఎంఇఒ, డిఇఒలను సంప్రదించాలని చెప్పారు. **తంబళ్లపల్లి :** స్థానిక మోడల్ స్కూల్లో 2025-2026 సంవత్సరం ఆరవ తరగతిలో ప్రవేశాలకు అర్హత కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎన్.హేమంత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 20న పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించబడునని తెలిపారు. మరిన్నీ వివరాలకు ప్రిన్సిపల్ ఫోన్ నెంబర్ 9052153538 ను సంప్రదించాలన్నారు.

పెయ్యదూడలకు టీకాలు

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల పరిధిలోని మాల్లూరుకు చెందిన గంగిరెడ్డిపల్లిలో 4 నుంచి 8 మాసాల వయస్సుగల పెయ్య దూడలకు బ్రూసెల్లోసెస్ వ్యాధి నివారణ టీకాలు ఉచితంగా పశుసంవర్ధక శాఖ సిబ్బంది వేశారు. జాతీయ పశు వ్యాధి నివారణ పథకం కింద జిల్లా వ్యాప్తంగా పశు వైద్య సిబ్బంది మూడవ దఫా మార్చి 21వతేదీ వరకు 15000 డోసులు వేయాలని లక్ష్యంగ వేస్తున్నారని, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.గుణశేఖర్ పిళ్ళై తెలిపారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపసంచాలకులు రాయచోటి డాక్టర్ డి. మాలకొండయ్య, డాక్టర్ డి.గణేష్, ముద్దు కృష్ణ, పశువైద్య సహాయకురాలు సుమలత, రామమోహన్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నిమ్మనపల్లి మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి నిమ్మనపల్లి

మండల సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం ఎంపిపి డి.నరసింహులు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఉదయం 11 గంటలలకు నిర్వహించబడునని పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కో-ఆప్షన్ సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు అందరూ తప్పనిసరిగా హాజరుకావాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను తీసుకురావాలని తెలిపారు.

ఘనంగా శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం

ప్రజాశకి-రాయచోటి

పట్టణంలోని గాలివీడు రోడ్డులో గల లక్ష్మీపురంలో మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ప్రథమ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా జరిగిన హోమపూజల్లో రాజంపేట నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం దంపతులు పాల్గొని హోమం నిర్వహించారు. టిడిపి సీనియర్ నాయకులు సుగవాసి ప్రసాద్‌బాబు శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడికి హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రసాద్ బాబును ఘనంగా సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో పట్టణ ప్రజలతో పాటు లక్ష్మీపురం ప్రజలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం అధ్యక్షులుగా మల్లికార్జున

ప్రజాశక్తి-కలికిరి

సమాచారం హక్కు చట్టం అధ్యక్షులుగా మద్దిరాల మల్లికార్జునను నియమించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మాజీ మంత్రి పెదిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో పీలేరు నియోజకవర్గంలో అనుబంధ విభాగాల అధ్యక్షులను మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి నియమించారు. రాష్ట్ర సమాచార హక్కు చట్టం నియోజకవర్గ అధ్యక్షులుగా వైసీపీ సీనియర్ నాయకుడు మద్దిరాల మల్లికార్జునను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మద్దిరాజు మల్లికార్జున మాట్లాడుతూ నా పైన ఎంతో నమ్మకం ఉంచి, నన్ను పీలేరు అసెంబ్లీ నియోజకవర్గం ఆర్‌టిఐ అధ్యక్షులుగా నియమించిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి. చింతల రామచంద్రారెడ్డి, నల్లారి తిమ్మారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అన్ని దానాల్లోకన్నా.. అన్నదానం గొప్పదని నవజీవన్ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి పేర్కొన్నారు. నవజీవన్ వెల్ఫేర్ సొసైటీ కోశాధికారి జి.పూజిత జన్మదినాన్ని పురస్కరించు కొని శుక్రవారం పట్టణంలోని పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ఆర్‌టిసి బస్టాండ్‌లో ఉన్న ఫుడ్ బ్యాంక్ కోర్టులో భోజనం ప్యాకెట్లు పెట్టారు. మిషన్ కాంపౌండ్ లోని శాంతిసదన్ నందు వృద్ధులను పలకరించి అన్నదానం చేశారు. పట్టణంలోని అనాథలు, విభిన్న ప్రతిభావంతులకు, పారిశుధ్య కార్మికులకు అన్నం ప్యాకెట్లు పంచి పెట్టారు. కార్యక్ర మంలో హెల్పింగ్ మైండ్స్ అధ్యక్షులు అబూబకర్ సిద్ధిక్, వికలాంగుల సంఘం అధ్యక్షులు మౌలాలి, స్టోర్ రఘు, చంద్రశేఖర్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలతో భూమి స్వాధీనం

ప్రజాశక్తి-రామసముద్రం

కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశాలతో శుక్రవారం రెవెన్యూ అధికారులు పోలీసుల సహకారంతో పట్టాభూమి స్వాధీనం చేసినట్లు బాధిత మహిళ రైతు సరోజమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలం లోని నారిగానిపల్లి రెవెన్యూ పరిధిలో దిగువలంబంవారిపల్లి వద్ద సరోజమ్మకు 42 సర్వే నెంబర్ లోని 1. 2బి .3. 5.6.7 సబ్ డివిజన్ పైకి ఒక ఎకరా 57.5సెంటు ఉంది. అదే గ్రామానికి చెందిన చిన్న రెడ్డప్పరెడ్డి తనకు భూమి ఉందని అడ్డుకుంటున్నాడని పేర్కొన్నారు. ఈ భూమి విషయమై పుంగనూరు, మదనపల్లె సివిల్ కోర్టుకు పోయి తన భూ హక్కును నిరూపించుకున్నట్లు తెలిపారు. కోర్టు కమిషన్ సరోజమ్మకు భూమి స్వాధీనం చేయాలని ఆదేశించిందని అన్నారు. కలెక్టర్‌ను తనకు భూమి స్వాధీనం చేయాలని ప్రజా ఫిర్యాదు విభాగంలో కోరానని తెలిపారు. స్పందించిన కలెక్టర్ తహశీల్దార్ నిర్మలాదేవికి బాధిత మహిళలకుభూమి స్వాధీనం చేయించాలని ఆదేశించారు. రెవిన్యూ సిబ్బంది ఆమె భూమిని పోలీసుల సహకారంతో స్వాధీనపరిచారు. మండల సర్వేయర్ నాగరాజ, ఎఎస్ఐ హిమాచలపతి, కానిస్టేబుల్ సురేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.


భూమిని అప్పగిస్తున్న రెవెన్యూ సిబ్బంది


చేపల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న గంగార్జున

చేపల పెంపకం లాభదాయకం

ప్రజాశక్తి-వీరబల్లి

చేపల పెంపకం లాభదాయకమని జిల్లా జీవనోపాధుల ప్రాజెక్ట్ మేనేజర్ గంగార్జున పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన చేపల పెంపకంపై ఆసక్తి గల రైతులకు ఉదయ్ ఆక్వా సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర స్థాయిలో సెర్ప్ సంస్థతో ఒప్పందం చేసుకోవడం జరిగిందన్నారు. సన్న, చిన్నకారు రైతులకు అర ఎకరా నుండి ఎకరా భూమి ఉన్న రైతులు చేపల పెంపకం ద్వారా సంవత్సరానికి ఒక లక్ష రూపాయలు ఆదాయం కల్పించడం జరుగుతుందన్నారు. ఈపద్ధతి వ్యవసాయం ద్వారా మరో 4 నుండి 5 రకాల పలుపంటల ద్వారా అదనపు ఆదాయం కల్పిస్తామని చెప్పారు. ఉదయ్ ఆక్వా కనెక్స్ ప్రతినిధి సుధాకర్ మాట్లాడుతూ ఒక టన్ను కొరమీను చేపల పెంపకానికి ప్రొడక్షన్స్ విలువ రూ.4.42 లక్షలు ఉంటుందన్నారు. మార్కెటింగ్ వరకు పూర్తి సహకారం సంస్థ నుంచి అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జీవనోపాధుల ఎపియం రమేష్ బాబు, స్థానిక ఎపియం ఖాదర్‌వలి, సిసి గంగాధరం, కృష్ణయ్య, సుధాకర్, చేపల పెంపకంపై ఆసక్తి గల రైతులు పాల్గొన్నారు.

45 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని కేంద్రంలో ప్రాథమిక పాఠశాలలో వినాయక మెడికల్స్‌షాపు ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు శంకరయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరాన్ని శ్రీ పద్మావతి షుగర్ క్లినిక్ వైద్య సిబ్బంది డాక్టర్ వెంకటేశ్వర ఉచితంగా వైద్య సేవలు అందించారు. ఉచితంగా షుగర్, థైరాయిడ్, బిపి వంటి వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. 45 మందికి వైద్య సేవలు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, నర్సులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

బి.కొత్తకోట : ఈనెల 22న వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సహకారంతో యంగ్ ఇండియా ఫౌండేషన్ సేవాసమితి ఆధ్వర్యంలో పెద్దతిప్పసముద్రం మండలం, రంగసముద్రం జడ్‌పి హైస్కూల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు యంగ్ ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపకులు తగాది రాజశేఖర్ తెలిపారు. శనివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా గుండె సంబంధిత వ్యాధులు, కేన్సర్,దీర్ఘకాలిక కీళ్లు, ఎముకల నొప్పితో బాధపడుతున్న వారికి వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలోని ప్రముఖ వైద్యులచే వైద్య పరీక్షలు నిర్వహించబడునున్నారు. డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్యసేవ, ఆయుష్మాన్ భారత్ పథకాల ద్వారా ఉచిత శస్త్రచికిత్సలు నిర్వహించబడునున్నారు. ముఖ్యంగా ఇసిజి, ఎకో, ముందస్తుగా కేన్సర్ వ్యాధిని గుర్తించేందుకు పాప్ సీమర్ టెస్ట్ తదితర పరీక్షలు ఉచితంగా చేయబడునన్నారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గం ప్రజలకు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు డాక్టర్ లోకేష్ భరణి 7799110121 యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ 9916073322 అనే మొబైల్ నెంబర్లను సంప్రదించాలని కోరారు

బిసి సెల్ జాయింట్ సెక్రటరీగా గెవన్న

ప్రజాశక్తి-రామసముద్రం


మండలంలోని కనగానికి చెందిన వైసిపి నాయకులు బి.గెవన్నకు వైసిపి అధిష్టానం స్టేట్ బిసి సెల్ జాయింట్ సెక్రటరీగా నియయించింది. ఈ సందర్భంగా గెవన్న మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనకు ఈ పదవి ఇచ్చినందుకు మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, మదనపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిస్సార్ అహ్మద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వైసిపి బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

ఘనంగా సాయివికాస్‌రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-పుల్లంపేట

కుడా చైర్మన్ ముక్కారూపానందరెడ్డి తనయుడు సాయివికాస్‌రెడ్డి జన్మదిన వేడుకలను నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఓబులవారిపల్లి మండలం గోవిందం పల్లి పంచాయతీ సిరిగిరాజుపల్లిలో గ్రామ ప్రజలు, అభిమానులు రక్తదాన శిబిరం నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మాట తనియోజకవర్గ వ్యాప్తంగా గ్రామ ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న యువ నాయకుడు సాయివి కాస్‌రెడ్డి అని అభినందించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సాయివికాస్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న టిడిపి నాయకులు


ఆలయ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే రూ.1.50 లక్షల విరాళం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

కురబలకోట మండల కేంద్రమైన తెట్టు గ్రామపంచాయతీ, మండ్యంవారిపల్లి గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి నూతన ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డి తన వంతు సాయంగా రూ.1.50 లక్షలు స్థానిక సర్పంచ్ నులక మనోహర్ రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు కోళ్ల వాసుదేవరెడ్డి, ఎంపిటిసి ఆనందరెడ్డి, జెసిఎస్ మండల కన్వీనర్ ఆర్.సి. ఈశ్వర్‌రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ కొరివి జగన్నాథరెడ్డి చేతుల మీదుగా ఆలయ ధర్మకర్త వెంకట రమణకు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ .ఆల యాల అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే దాతృత్వాన్ని కొనియాడారు. కార్యక్రమంలో వైసిపి నాయ కులు నారాయణ, అశోక్‌రెడ్డి, శ్రీనివాసులు, శీను, శివయ్య, హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు కంచి బల రాంరెడ్డి కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పుల్లంపేట : తెలుగుతల్లి వేషధారణలో విద్యార్థులు

ఘనంగా మాతృభాషా దినోత్సవం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల దలవాయిపల్లిలో ఉపాధ్యాయుడు రమణ ఆధ్వర్యంలో ఘనంగా మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తెలుగు తల్లి వేషధారణలో విద్యార్థులు అలరించారు. విద్యార్థులకు చిత్రలేఖన, చేతిరాత, మెమొరీ గేమ్స్, పద్యాలు, కవితలు తదితర పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు మాట్లాడుతూ మాతృభాష ఏదైనా అది తల్లితో సమానమని మనం తల్లికి ఎంత గౌరవం ఇస్తామో మాతృ భాషకు కూడా అంతే గౌరవం ఇవ్వాలని అన్నారు. మాతృభాష మీద పట్టు ఉన్న వ్యక్తి ఏ భాషనైనా సులభంగా నేర్చుకోగలడని పేర్కొన్నారు. **మదనపల్లె :** కన్న తల్లిని మించిన దైవం.. తెలుగు మించిన భాష మరొకటి లేవని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గోపతి బాలకృష్ణమూర్తి అన్నారు.అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తెలుగువాడిగా పుట్టినందుకు గర్వ పడాలని మాతృభాష అందరికీ ఉగ్గుపాల వంటిదని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి సేగు రెడ్డప్పరెడ్డి, సీనియర్ అధ్యాపకులు శివ పార్వతి, శ్రీదేవి, మాలతి, రమణ అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.**నందలూరు :** అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు మండలంలోని నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా జరిగాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయలలిత కుమారి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ, గీత, రమణమ్మ, జ్యోతి ప్రియ, జీవీ ప్రసాదరావు, ప్రమీల రాహేల్ ఈ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులచే నిర్వహించబడిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తెలుగు, హిందీ, ఆంగ్ల భాషల పరంగా నిర్వహించిన పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఖాదర్ బాష, రవి శంకర్ రెడ్డి, లక్ష్మీనారాయణ, బోగా వెంకటసుబ్బయ్య, మస్తాన్, విజయ కుమారి, తులసీ స్వర్ణలత, పాలేటి సుబ్బరాయుడు, గొంటుముక్కుల వెంకటరమణ, ఆర్ వి రమణమ్మ, గౌరీ పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లెకు సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మల్లయ్యకొండపైన మహాశివరాత్రి ఏర్పాట్లను అధికారులు, నాయకులు పరిశీలించారు. మల్లయ్యకొండ మాజీ చైర్మన్ కనుగొండ మద్దిరెడ్డి, నల్లగుండ్ల మల్లికార్జునరెడ్డి, ఎస్ఐ లోకేశ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఉత్తంరెడ్డి మల్లికార్జున స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. కొండ కింద వాహనాల పార్కింగ్, కమ్యూనిటీ హాల్ వద్ద మరమ్మతు పనులను పరిశీలించారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లను చేయాలని తెలిపారు.


మల్లయ్యకొండపై ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

క్రైం కార్నర్

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని కేతావాండ్లపల్లి గ్రామానికి చెందిన కొండి నాగిరెడ్డి (43) గురువారం సాయంత్రం మద్యం మత్తులో ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ మోహన్‌కుమార్‌గౌడ్ తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారుడు తిరుపతిలో బిఎస్‌సి నర్సింగ్ మూడో సంవత్సరం చదువుతున్నట్లు సమాచారం. పోస్టుమార్టం నిమిత్తం మృతుడిని రాజంపేటకు తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

లారీ ఢీకొని టెంపో డ్రైవర్ దుర్మరణం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కురుబలకోట మండలం, అంగళ్ళు బైపాస్ రోడ్డు బ్రిడ్జి పై శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో టెంపో డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కథనం మేరకు.. తంబళ్లపల్లి నియోజకవర్గంలోని మొలకలచెరువ మండలం, సోంపల్లి పంచాయతీ, రాయపువారి పల్లెకు చెందిన పుట్టుకతో అంధుడైన ఉత్తన్న కుమారుడు మనోహర్ (23) టెంపో డ్రైవర్‌గా పనిచేసుకుంటూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. గ్రామంలోని రైతులు పండించిన టమోటాలను టెంపోలో లోడ్ చేసుకొని మదనపల్లె టమోటా మార్కెట్ కు తరలించాడు. కాయలు అన్లోడ్ చేసిన అనంతరం టెంపోలో స్వగ్రామానికి వెళుతుండగా, మార్గమధ్యంలోని అంగళ్ళ బైపాస్ రోడ్డు బ్రిడ్జిపై, కదిరి వైపు నుంచి చెన్నై వైపు వెళ్తున్న లారీ, టెంపో వేగంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో టెంపో డ్రైవర్ మనోహర్ టెంపోలో ఇరుక్కుపోయి దుర్మరణం చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దిలీప్ కుమార్ తెలిపారు. కుటుంబానికి ఆసరాగా ఉంటున్న ఒకగానొక్క బిడ్డ ఇక లేడని తెలియడంతో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు.